సాక్షి ఖమ్మం

శనివారం | 10 | జూన్ | 2023



దరి చేరింది.. మంచి జరిగింది!

జిల్లాల విభజన, మండలాలు, జీపీల ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువ కావడమే కాక మంచి ఫలితాలు వస్తున్నాయి. 8లో



నేడు జిల్లాకు హోంమంత్రి

రఘునాథపాలెంలోని పోలీసుస్టేషన్, తహసీల్‌ను మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ అజయ్ నేడు ప్రారంభిస్తారు. 8లో



వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం కూడా గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని 38 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలకు 10,182మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమస్యలు ఉంటే కంట్రోల్ రూం నంబర్లు 99489 04023, 77939 16207లో సంప్రదించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈసమావేశంలో డీఆర్వో శిరీష, డీఐఈఓ రవిబాబు, డీఈసీ సభ్యులు కె.శ్రీనివాస్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ ఆధ్వర్యాన వివిధ కేసుల పరిష్కారం కోసం ఐదు బెంచ్‌లు ఏర్పాటుచేశారు. రోడ్డు ప్రమాద కేసుల పరిష్కారానికి అదనపు జిల్లా న్యాయమూర్తి డి.రాంప్రసాదరావు, సీనియర్ సివిల్ జడ్జి కేసులు, బ్యాంకు కేసులను సీనియర్ సివిల్ జడ్జి ఎన్.అమరావతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లోని కేసులను మూడో అదనపు మెజిస్ట్రేట్ వి.మాధవి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కేసులను మెజిస్ట్రేట్ కె.దీప, మొబైల్, ఎక్సైజ్ కోర్టు కేసులను ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఆర్.శాంతిలత అధ్యక్షతన ఏర్పాటయ్యే బెంచ్‌ల్లో పరిష్కరిస్తారు.

సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అనారోగ్య కారణాలు, అంగ వైకల్యం, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న వారికి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావు కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మకు ఖమ్మంలో శుక్రవారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా రెండు మీడియంలకు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను నిర్బంధంగా ఉన్నత పాఠశాలలకు కేటాయించొద్దన్నారు. నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, రత్నరాజు, కట్టా శేఖర్, రవికుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖమ్మంక్రైం: జిల్లాలో ఈనెల 11వ తేదీ ఆదివారం గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష జరగనుంది. ఈమేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. ఆంక్షలు అమల్లో ఉండనున్నందున పరీక్ష కేంద్రాలకు 500మీటర్ల వరకు జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 50 పరీక్ష కేంద్రాల వద్ద ఈ ఆంక్షలు అమలుచేస్తామని తెలిపారు.

ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణకు పదోన్నతి

ఖమ్మం క్రైం: అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఉమ్మడి జిల్లా డీఎస్పీ ఎస్.సూర్యనారాయణకు ఏఎస్పీగా పదోన్నతి లభించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యనారాయణ ఏడాది కాలంగా ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, సూర్యనారాయణ స్థానంలో డీఎస్పీగా ఇంకా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

గడీల రాజ్యాన్ని తరిమికొడదాం..



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పక్కన నాయకులు

- జాకీ పెట్టి లేపినా కాంగ్రెస్ లేచే పరిస్థితి లేదు
- అమిత్‌షా సభ సక్సెస్‌తో సత్తా చాటుదాం
- సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



మైదానంలో నేతలకు సూచనలు చేస్తున్న సంజయ్

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణలో రాబోయేది కాషాయ రాజ్యమేనని, గడీల రాజ్యాన్ని తరిమికొట్టడానికి ఐదు నెలలే ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఈనెల 15న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానుండగా, శుక్రవారం వచ్చిన సంజయ్ ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో బీజేపీ సత్తా ఏమిటో నిరుద్యోగ మార్చ్‌తో చాటామని, ఈనెల 15న జరిగే అమిత్ షా సభను సక్సెస్ చేసి మరోసారి దమ్ము చూపిద్దామని పిలుపునిచ్చారు. ఖమ్మంకు అమిత్ షా వస్తున్నారని తెలియగానే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెమటలు పడుతున్నాయన్నారు. అమిత్‌షా సభ సక్సెస్ అయ్యాక అవసరమైతే ప్రధాని మోదీ సభను కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కాగా, తెలంగాణతో పాటు కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా దేశంలో కాంగ్రెస్ ఎక్కడా లేదని, జాకీ పెట్టి లేపినా లేవదన్నారు. అలాగే, కమ్యూనిస్టుల పనైపోయిందన్నారు. సూది, దబ్బణం పార్టీలని అవమానించిన కేసీఆర్ పంచనే చేరిన సిగ్గు, శరం లేని నేతలు కమ్యూనిస్టులని సంజయ్ ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్ అరాచకాలకు అంతేలేదు..

ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయిందని సంజయ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ బాధితుల సంఘం సమావేశం పెడితే సర్దార్ పటేల్ స్టేడియం కూడా సరిపోదని పేర్కొన్నారు. కొందరు పోలీసులు బీఆర్‌ఎస్‌కు తలొగ్గి బీజేపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నా భయపడే కార్యకర్తలు బీజేపీలో లేరన్నారు. ఖమ్మం జిల్లాలో నేతల ఆగడాలకు బలైపోయిన సాయి గణేష్ త్యాగాలను వృథా కానివ్వమని చెప్పారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. సీఎం సహా మంత్రులు జిల్లాల్లో పర్యటించాలంటే బీజేపీ కార్యకర్తలను చూసి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. భద్రాచలం రామాలయం అభివృద్ధికి ఇస్తామన్న రూ.100 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు, నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం వంటివేమీ అమలుకాలేదని ఎద్దేవా చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మిస్తున్న ఘనత ప్రధాని మోదీదైతే... భద్రాచలం సీతారాముడి కల్యాణానికి తలంబ్రాలు కూడా తీసుకెళ్లని చరిత్ర కేసీఆర్‌దని, ఎవరు నిజమైన రామభక్తులో చెప్పాలన్నారు.

సందడి చేసిన బండి

అమిత్‌షా సభ నిర్వహణ కోసం సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానాలను పరిశీలనకు వచ్చిన బండి సంజయ్ సందడి చేశారు. అక్కడ చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఆ తర్వాత నేతలు, కార్యకర్తలతో నడుస్తూ వెళ్లి కేఫ్‌లో చాయ్ తాగారు. ఈ సమావేశంలో బీజేపీ తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీమంత్రి విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వర రావు, ఎం.ధర్మారావు, కొండేటి శ్రీధర్, కుంజా సత్యవతి, నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, గల్లా సత్యనారాయణ, కోనేరు చిన్ని, బొబ్బ భాగ్యారెడ్డి, రామచంద్రారెడ్డి, రావు పద్మ, కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, పాల్వాయి రజని, సినీ నటి కవిత, గీతామూర్తి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కడగంచి రమేశ్, విద్యాసాగర్‌రెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, రుద్ర ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి తప్పులన్నీ సరిచేశాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, వేదికపై కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అధికారులు, ప్రజాప్రతినిధులు

- సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు
- కరోనా సమయంలోనూ పథకాలు ఆగలేదు..
- సంక్షేమ దినోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష చెక్కు ఇస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను తెలంగాణ ఏర్పడగానే సరి చేయడమే కాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో శుక్రవారం సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో రూ.200 పింఛన్ నాలుగు నెలలకోసారి ఇవ్వగా, అందుకోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం ఆసరా లబ్ధిదారులకు రూ.3,016, రూ.2,016 పింఛన్‌ను ఖాతాల్లోనే జమ చేస్తున్నారన్నారు. గతంలో ఖమ్మం నియోజకవర్గంలో కేవలం 10 వేల మందికే వచ్చిన పింఛన్ ఇప్పుడు 37 వేల మందికి వస్తోందని తెలిపారు. ఇక త్వరలోనే గృహలక్ష్మి పథకం ద్వారా సొంత స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

మళ్లీ సీఎం కేసీఆర్ అయితేనే...

పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి కొనసాగాలన్నా ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని మంత్రి పువ్వాడ అన్నారు. కరోనా సమయంలో ఉద్యోగుల జీతాలు ఆలస్యమైనా సంక్షేమ పథకాలు మాత్రం ఆపలేదన్నారు. మరోసారి కేసీఆర్‌ను సీఎంగా గెలిపిస్తే అన్ని పథకాలు సాఫీగా సాగుతాయని తెలిపారు. ఖమ్మం అభివృద్ధికి పాటుపడుతున్న తనను సాదుకుంటారో.. చంపుకుంటారో ప్రజల చేతిలో ఉందన్నారు. ఎన్నికల సమయాన డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయాలని వచ్చే వారిని నమ్మొద్దని సూచించారు.

రూ.100 కోట్ల మైలురాయి

కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్‌ఎఫ్ పథకాలకు సంబంధించి నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్న నిధులు రూ.100 కోట్లకు చేరుకోవడం సంతోషంగా ఉందని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. సంక్షేమ సంబురాల సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 112 మందికి రూ.1.12 కోట్లతో పాటు 212 మందికి రూ.79.82 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు.

కుల, చేతివృత్తులకు రూ.లక్ష, గొర్రెల పంపిణీ

బీసీల్లోని కుల, చేతి వృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ పథకాన్ని మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఖమ్మం నియోజకవర్గంలోని పది మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసి వారు ఏర్పాటుచేసే యూనిట్లను పరిశీలించారు. అలాగే, రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు యూనిట్లు, కొత్త ఆసరా పెన్షన్ కార్డులు, 58, 59 జీఓ ద్వారా 150మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.జ్యోతి, పశుసంవర్ధకశాఖ జేడీ వేణుమనోహర్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

చేయితోనే చేయి కలుపుదాం..

- కాంగ్రెస్‌లో చేరాలని పొంగులేటి అనుచరుల ఏకాభిప్రాయం
- పది నియోజకవర్గాల నేతల సమావేశంలో వెల్లడి
- అనుచరుల అభీష్టం మేరకే నిర్ణయమన్న శ్రీనివాసరెడ్డి
- ఈ నెలాఖరులోగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఐదు నెలల రాజకీయ ఉత్కంఠకు తెర దించారు. అనుచరుల అడుగు జాడల్లోనే నడుస్తానని, వారి అభీష్టమే తన నిర్ణయమని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో హైదరాబాద్ వేదికగా ఏ పార్టీలో చేరతానన్న నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. ఈ నెలాఖరులోనే భారీ బహిరంగ సభ ఖమ్మంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి 1న బీఆర్‌ఎస్‌పై తిరుగుబావుటా ఎగురవేసిన ఆయన ఐదు నెలల పది రోజుల తర్వాత కాంగ్రెస్‌లోనే చేరనున్నట్లుగా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశానికి పది నియోజకవర్గాల నుంచి ఆయన అనుచరులు భారీగా తరలివచ్చారు. ఈ సమావేశం వేదికగా అటు పాలకులపై ఘాటు వ్యాఖ్యలు చేయడంతోపాటు ఇక ముందు రాజకీయ ఫైట్ అంటూ అనుచర నేతలను కార్యోన్ముఖులను చేస్తూ ప్రసంగించారు.

ఒక్కొక్కరుగా వచ్చి.. జై కాంగ్రెస్ అని..

ఉదయం 8 గంటల నుంచే పది నియోజకవర్గాల నుంచి పొంగులేటి అనుచరులు చేరుకోగా.. ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల నుంచి ఐదుగురు చొప్పున తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆ తర్వాత వైరా, పాలేరు, మధిర, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల అనుచరులు మాట్లాడారు. 2019 నుంచి పొంగులేటికి అన్యాయం జరుగుతున్నందున కాంగ్రెస్‌లో చేరితేనే అన్యాయం చేసిన వారికి దీటైన సమాధానం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరితే ఉమ్మడి జిల్లాలో తమ సత్తా నిరూపిస్తామంటూ తెలిపారు. ఈ సమయాన అనుచరులందరూ జై కాంగ్రెస్ అంటూ నినదించారు. రెండున్నర గంటలపాటు ఈ సమావేశం సాగింది. చివరకు అన్ని నియోజకవర్గాల నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లోనే చేరాలని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

అనుచరుల్లో జోష్..

పొంగులేటి ఈ సమావేశంలో అర గంటకు పైగా మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్‌లో చేరితే తండ్రి సమానమైన వ్యక్తే టికెట్ ఇవ్వలేదని చెబుతూ, తనకు పదవులు కాకుండా ప్రజాసేవే ముఖ్యమంటూ పేర్కొన్నారు. 'పలు దఫాలుగా మీతో పార్టీ చేరిక విషయమై అభిప్రాయ సేకరణ చేసినా చివరకు మీ నిర్ణయం ప్రకారమే నేను నడుస్తాను' అని తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా తనను ఆదరిస్తున్నారని, అందరం కలిసి యుద్ధం చేద్దామంటూ వ్యాఖ్యానించారు. ఏ పార్టీలో చేరుతున్నాననేది హైదరాబాద్‌లో రెండు, మూడు రోజుల్లో వెల్లడిస్తామని.. ఢిల్లీ ముఖ్యనేతలతో మాట్లాడాక ఖమ్మంలో భారీ బహిరంగ సభ తేదీ ఖరారు చేస్తామని తెలిపారు. ఇది ఈ నెలాఖరులోగానే ఉండొచ్చని చూచాయగా చెప్పుకొచ్చారు. దీంతో పొంగులేటి కాంగ్రెస్‌లోకే వెళ్తున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లయింది.

ఖమ్మం నుంచే పోటీ

పొంగులేటి మాట్లాడుతున్న సమయాన అనుచర నేతలు ఆయన ఖమ్మంలోనే పోటీచేయాలంటూ నినదించారు. జై పొంగులేటి.. జై కాంగ్రెస్.. జై ఖమ్మం అంటూ నినాదాలు చేశారు. పది నియోజకవర్గాల నుంచి పరిమిత సంఖ్యలో నేతలనే ఆహ్వానించినా అంతకుమించి హాజరయ్యారు. సమావేశం అనంతరం కొందరు ముఖ్యనేతలతో పొంగులేటి తన నివాసంలో సమీక్షించాక హైదరాబాద్ వెళ్లారు. ఈ సమావేశంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నేతలు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, మచ్చా శ్రీనివాస్‌యాదవ్, తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయాబాయి, జారె ఆదినారాయణ, ఆకుల మూర్తి, మేకల మల్లిబాబు యాదవ్, గుండా వెంకటరెడ్డి, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, జాలె జానకిరెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా ఆర్టీసీ



విలేజ్ బస్ ఆఫీసర్లతో ఏసీపీ, ఆర్‌ఎం తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థ దోహదపడుతుందని నగర ఏసీపీ గణేష్ తెలిపారు. ఆర్టీసీలో విలేజ్ ఆఫీసర్లుగా నియమితులైన వారికి శుక్రవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో గుర్తింపు కార్డులు, కిట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ వ్యవస్థ ద్వారా వీలవుతుందన్నారు. ఆర్‌ఎం ప్రభులత మాట్లాడుతూ ప్రజలు, సంస్థ నడుమ వారధిగా ఉంటూ ఆర్టీసీ అభివృద్ధి పాటుపడాలని సూచించారు. ఖమ్మం డీఎం శ్రీనివాస్, సీఐ రామయ్య, డాక్టర్ గిరిసింహారావు తదితరులుపాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు

హామీ ఇచ్చిన ఎంపీ నామా నాగేశ్వరరావు




ఎంపీ నామాకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గిట్టుబాటు ధరకు సంబంధించి ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి యత్నిస్తానని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు ఆయిల్‌పామ్ రైతు ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. తెలంగాణ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ ఆధ్వర్యాన శుక్రవారం పలువురు రైతు ప్రతినిధులు ఖమ్మంలో ఎంపీని కలిసి సమస్యలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ రైతులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుండగా, కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఎదురవుతున్నట్లు ఇబ్బందులను చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో బండి భాస్కర్ తదితరులు ఉన్నారు.

అగ్ని గుండం

- నిప్పులు కురిపించిన సూరీడు
- నేలకొండపల్లి, ముదిగొండ, సత్తుపల్లిలో గరిష్ట ఉష్ణోగ్రతలు



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండ వేడి అగ్నిగుండాన్ని తలపించింది. ఉష్ణోగ్రతలు శుక్రవారం తారాస్థాయికి చేరడంతో నేలకొండపల్లి, ముదిగొండ, సత్తుపల్లి మండలాలు నిప్పుల కుంపటిలా మారాయి. ఇందులో నేలకొండపల్లిలో 46.5, ముదిగొండ మండలం బాణాపురం, పమ్మిలో 46.2, సత్తుపల్లిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం పరిసర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యమవుతుండటంతో వాతావరణంలో మార్పు కనిపించకపోగా, ప్రజలు ఎండ వేడి, వడగాలులతో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఉష్ణోగ్రతలు, వడగాలుల ప్రభావం చూపుతున్నాయి. పది గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కానరావడం లేదు. దీంతో పగటి వేళ ఎక్కడ చూసినా రహదారులు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఇళ్లకే పరిమితమైన ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను వినియోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. జిల్లాకు 4.34 మిలియన్ యూనిట్ల విద్యుత్ కోటా ఉండగా, వారం రోజులుగా 5 మిలియన్ల మేర విద్యుత్ వినియోగం నమోదవుతోందని అధికారులు తెలిపారు. కాగా, శుక్రవారం పల్లెగూడెం(ఖమ్మం రూరల్ మండలం), పెనుబల్లిలో 44.9, ఖానాపురం(ఖమ్మం అర్బన్), మధిరలో 44.8, తల్లాడలో 44.6, పెద్దగోపతి, ఎర్రుపాలెం, మధిర(ఏఆర్‌ఎస్), ముదిగొండ, కల్లూరు, సిరిపురంల్లో 44.5, వైరా, తిరుమలాయపాలెం, గేటు కారేపల్లి, గంగారంల్లో 44.3, తిమ్మారావుపేట, బచ్చోడు, కొనిజర్ల, చింతకానిలలో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలలే ప్రగతికి పునాదులు

ఖమ్మంరూరల్: అన్ని వసతులు, నిపుణులైన ఉపాధ్యాయులతో కూడిన ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల ప్రగతికి పునాదులని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని మంగళగూడెంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం చేపట్టిన బడిబాట ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన ఉచిత విద్యతో పాటు, పౌష్టికాహారం, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మన ఊరు - మన బడిలో భాగంగా పాఠశాలల్లో అన్ని వసతులుకల్పించినట్లు చెప్పారు. ఈసందర్భంగా గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి విద్యార్థులను పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించారు. ఎంఈఓ శ్యాంసన్, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ వి.దేవేంద్రమ్మ, వైస్ చైర్మన్ బి.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లేకపోతే ఎలా?

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో బడిబాట ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులకు చేదు అనుభవం ఎదురైంది. ఉన్నత పాఠశాలలో 13 మంది ఉపాధ్యాయులకు ఏడుగురే పనిచేస్తున్నందున పిల్లలను పంపించమని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో నెలాఖరుకల్లా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని చెప్పడంతో సర్పంచ్ ఉమ్మినేని బాబు, గ్రామస్తులు పిల్లలను బడికి పంపించేందుకు అంగీకరించారు.

క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడడంపై దృష్టి

నేలకొండపల్లి: పర్యావరణాన్ని కాపాడేందుకు గ్రానైట్ పరిశ్రమ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని పలు సంస్థల ప్రతినిధులు కోరారు. మండలంలోని చెరువుమాధారంలో శ్రీ వీ.ఎస్.వీ. గ్రానైట్స్‌కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, పర్యావరణ నిబంధనలు పాటించడంతో గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగాఅదనపు కలెక్టర్ మధుసూదన్ పలు సూచనలు చేశారు. కొత్తగూడెం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రవీందర్, ఉప సర్పంచ్ ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో శతాధిక వృద్ధురాలు మృతి


బుద్దారపు సరస్వతి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరానికి చెందిన శతాధిక వృద్ధురాలు బుద్దారపు సరస్వతి(104) వడదెబ్బతో మృతి చెందింది. కొద్దిరోజులుగా విపరీతమైన ఎండ, వడగాలులతో అస్వస్థతకు గురైన ఆమె శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, మనవడు ఉప్పల శ్రీనివాసశర్మ జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నారు.

తిమ్మినేనిపాలెంలో..


రావమ్మ (ఫైల్)

చింతకాని: బోనకల్ మండలం తిమ్మినేనిపాలెంలో తుమ్మల రావమ్మ(110) అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందింది. ఈమేరకు ఆమె మృతదేహం వద్ద సర్పంచ్ దమ్మాలపాటి శ్రీదేవితో పాటు అబ్దుల్ నబీ, తెల్లగొర్ల కృష్ణ, నంజాల అప్పారావు, షేక్ మదార్ సాహెబ్, దమ్మాలపాటి జగన్మోహన్‌రావు, కూచిపూడి కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బోనకల్: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపాన గుర్తు తెలియని వ్యక్తి(30) శుక్రవారం మృతి చెందాడు. సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు జీఆర్పీ ఎస్ఐ బాస్కర్‌రావు తెలిపారు.

చెట్టు పైనుండి పడి గీత కార్మికుడు మృతి


నాగేశ్వరావు (ఫైల్)

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లకు చెందిన కల్లుగీత కార్మికుడు బందం నాగేశ్వరావు(55) ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుండి పడి మృతి చెందాడు. గీత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న నాగేశ్వరావు రోజులాగే శుక్రవారం కల్లు గీయడానికి వెళ్లగా ఈ ప్రమాదం జరిగింది. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కవిత తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు


కీర్తిక నుదురుపై గాయాలు

ముదిగొండ: మండలంలోని కమలాపురం బీసీ కాలనీలో పిచ్చికుక్క దాడిలో శుక్రవారం పలువురికి గాయాలయ్యాయి. కాలనీకి చెందిన కొందరు మాట్లాడుకుంటుండగా వచ్చిన పిచ్చికుక్క వారితో ఉన్న ఆరేళ్ల చిన్నారిని గాయపరిచింది. అంతకుముందే మరో ఇద్దరిపై కూడా దాడి చేసింది. ఇక గంధసిరిలో ఓ కుక్క బాలుడిపై దాడి చేయగా, ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఇంట్లో దాచిన రూ.82వేలు చోరీ

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు జీడిమెట్ల బుజ్జి, ఆమె భర్త పనులకు వెళ్లారు. ఇంటి దగ్గర వారి కుమార్తె మాత్రమే ఉంది. సాయంత్రం వారు తిరిగి వచ్చేసరికి బీరువాలో దాచిన రూ.82వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. కుమార్తె ఆరు బయట ఆడుకుంటున్నట్లు చోరీ చేసి ఉంటారని భావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,346

దరి చేరింది.. మంచి జరిగింది!

- జిల్లాల విభజన, మండలం, జీపీల ఏర్పాటుతో చేరువైన పాలన
- లబ్ధిదారులకు తప్పిన వ్యయప్రయాసలు
- ఐడీఓసీ నిర్మాణంతో ఒకేచోట 37శాఖలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలో ప్రజలకు పాలన చేరువవుతోంది. జిల్లాల విభజన, కొత్త మండలాల ఏర్పాటు, గ్రామపంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన దరి చేరడమే కాక పలువురికి అవకాశాలు దక్కాయి. దూరప్రాంతాల నుంచి అధికారులను కలిసేందుకు, సమస్యలను విన్నవించేందుకు వ్యయప్రయాలకోర్చి రావాల్సిన బాధ తప్పించింది. ఇక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ–కలెక్టర్) నిర్మాణంతో అన్ని శాఖలు ఒకేచోట కొలువు దీరడంతో ప్రజల పని మరింత సులువైంది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా కథనం

46నుంచి 21 మండలాలకు...

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించగా అప్పట్లో ఖమ్మం జిల్లా పరిధి 46 మండలాలతో విస్తృతంగా ఉండేది. అధికార యంత్రాంగం భద్రాచలం, ఆపై మండలాల్లోని ఏదైనా ప్రాంతానికి వెళ్తే ఉదయం వెళ్తే సాయంత్రం వరకు తిరిగి వచ్చే అవకాశం లేకపోయేది. ఈక్రమంలో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురయ్యేవని చెబుతున్నారు. అదే విధంగా భద్రాచలం, చర్ల తదితర ప్రాంతాల ప్రజలు ఉన్నతాధికారులను కలిసేందుకు వస్తే ఒక వేళ అధికారి లేకపోతే ఇక అంతే. మరుసటి రోజు వరకు వేచిఉండడం, లేదంటే దూరమైనా సరే ఇంటికి వెళ్లి మళ్లీ రావాల్సి వచ్చేది. ఈక్రమంలోనే 2016 అక్టోబర్ 1న కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఖమ్మం జిల్లాలోని కొంత భాగాన్ని వేరు చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా ఏర్పాటు చేశారు. ఇక ఖమ్మం నూతన జిల్లా ఏర్పడినప్పుడు 20 మండలాలు ఉండగా... రఘునాథపాలెం మండలాన్ని ఏర్పాటు చేయటంతో సంఖ్య 21కు చేరింది.


వీ.వీ.పాలెంలోని ఐడీఓసీ భవనం

నాటి నుంచి సేవలు ఇలా...

ఖమ్మం నియోజకవర్గంలో ఖమ్మం అర్బన్(ఖమ్మం నగరం), రఘునాథపాలెం మండలాలు ఉండగా.. మిగతా నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు మండలాలు ఉన్నాయి. దీంతో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులెవరైనా తక్కువ సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లి రావడం సులువైంది. అలాగే, ప్రజలు కూడా జిల్లా కేంద్రానికి వచ్చి అధికారులను కలవడం, సమస్యలను విన్నవించడం సాఫీగా సాగుతోంది.

క్షేత్రస్థాయికి ప్రజావాణి

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డేకు రావాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఓ వారం మధిర, ఇంకో వారం కల్లూరులో సైతం ప్రజావాణి(గ్రీవెన్స్‌డే) నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కాగా, ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డేలో కలెక్టర్ వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తూనే వాటి స్థితిగతులపై అక్కడికక్కడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేస్తుండడంతో సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తోంది. ఇందులో భాగంగానే ఖమ్మం గట్టయ్య సెంటర్‌కు దివ్యాంగురాలు కూరపాటి రాంబాయి గతనెల మార్చిలో ప్రజావాణికి వచ్చి కలెక్టర్ గౌతమ్‌కు ట్రై సైకిల్ కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో వారంలోగా ఆమెకు ట్రై సైకిల్ ఇప్పించగా కృతజ్ఞతలు తెలిపింది.

ధరణి దోహదం

ఐడీఓసీతో పాటు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి విచారణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి సైట్ ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. జిల్లాలో 54,563మంది వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకోగా 47,198 సమస్యలను పరిష్కరించారు. అదే విధంగా 58 జీఓ ద్వారా జిల్లాలో 3,253 దరఖాస్తులను ఆమోదించి పట్టాలు పంపిణీ చేశారు. ఇంకా 59 జీఓ ద్వారా 2559 దరఖాస్తులు ఆమోదించి ఇప్పటి వరకు 202 దరఖాస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.


ఫిర్యాదు స్వీకరిస్తూ వీసీ ద్వారా సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్(ఫైల్)

అన్ని కార్యాలయాలు ఒకే చోట

ఖమ్మం నుంచి భద్రాద్రి జిల్లా ఏర్పడ్డాక పాత కలెక్టరేట్ వేదికగానే పాలన సాగింది. అయితే, వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలో విసిరేసినట్లుగా ఉండడంతో అన్నింటినీ ఒకేచోటకు చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో రైతుల నుంచి 20.10ఎకరాల భూమి సేకరించి 2018లో ఐడీఓసీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ పరిహారం రూ.21.76 కోట్లు, నిర్మాణ పనులకు రూ.35.38కోట్లు వెచ్చించారు. ఈ కలెక్టరేట్‌ను తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు విజయన్, కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్ ప్రారంభించారు. తద్వారా మూడంతస్తుల్లోని ఈ భవనంలో 37శాఖలు కొలువుదీరాయి.

వెనకబడిన తరగతుల బలోపేతానికి కృషి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- వైరా, మధిరలో రూ.లక్ష సాయం, గొర్రెల యూనిట్లు పంపిణీ

వైరా: కుల, చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వెనకబడిన తరగతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తూ బలోపేతం చేయాలని నిర్ణయించిదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో శుక్రవారం వైరాలో ఏర్పాటుచేసిన తెలంగాణ సంక్షేమ సంబరాల్లో ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. చేతి, కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం, గొల్ల, కుర్మలకు రెండో విడత గొర్రెల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ అర్హులందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం అందుతుందని, ఇందుకోసం 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు లేని వారి కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ఈనెల 12నుంచి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆతర్వాత ఇళ్లు లేని పేదలు 100 మందికి పట్టాలు, పది మంది యాదవులకు గొర్రెల యూనిట్లు అందజేశారు. ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తోందని తెలిపారు. అదనపు కలెక్టర్ స్నేహలత, మండల ప్రత్యేకాధికారి జె.సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖాధికారి బి.జ్యోతి, తహసీల్దార్ ఎస్.అరుణ, ఎంపీడీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కొణిజర్ల తహసీల్దార్ డి.సైదులు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మధిర: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. మధిరలో శుక్రవారం నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్లు లేని పేదవారికి ఇంటి స్థలాలు, చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి రూ.లక్ష ఆర్థిక సాయం, గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు. మధిర నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 9 వేల కుటుంబాలు లబ్ధి పొందాయని చెప్పారు. ఈ పథకంలో చాలా చోట్ల బాల్య వివాహాలు తగ్గిపోయాయని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, ఎంపీపీ లలిత, ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు, మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా, మధిరలోని బస్తీ దవాఖానాను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌వీ భార్గవితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు.


వైరా : గొర్రెలు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే రాములునాయక్


మధిర: సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

బీజేపీకి గడ్డుకాలం మొదలైంది..

- కొత్తగూడెంలో 11న జరిగే సభకు సబ్బండ వర్గాల సమీకరణ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ వ్యాప్తంగా బీజేపీకి గడ్డుకాలం ప్రారంభమైందని, రామాలయం నిర్మిస్తున్న అయోధ్యలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ ఆరు స్థానాలు దక్కించుకోవడమే ఇందుకు నిదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశ్‌కో బచావో – బీజేపీకో హఠావో నినాదంతో బీజేపీ పాలనలో జాతీయ సంస్థల విక్రయం, ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం తదితర అంశాలపై సీపీఐ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఇక రాష్ట్రప్రభుత్వం ముందుగా హామీ ఇచ్చినట్లు 11 లక్షల ఎకరాల పోడు భూమికి పట్టాలు ఇవ్వాలని కూనంనేని డిమాండ్ చేశారు. అలాగే, సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని, సొంత స్థలాలు లేని వారికి నివాస స్థలాలు కేటాయించాలన్నారు. కాగా, లక్ష మంది జన నినాదమే లక్ష్యంగా సబ్బండ వర్గాలను సమీకరించి ఈనెల 11న కొత్తగూడెంలో ప్రజాగర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సీపీఐ భవిష్యత్ కార్యాచరణకు సభలో ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటి నుంచి పార్టీకి అండగా నిలుస్తుండడంతోనే కొత్తగూడెం సభ ఏర్పాటు చేశామని తెలిపారు. అవినీతిమయమైన పాలక పార్టీలతో విసిగిపోయిన ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూడక తప్పని రోజులు వస్తున్నాయని కూనంనేని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కలు ధ్వంసం

- నిందితులపై పీడీ యాక్టు నమోదు

కారేపల్లి: కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని ఊట్కూరు బీట్ ఎర్రబోడు రిజర్వ్ ఫారెస్టు ప్లాంటేషన్ లో మొక్కలను పలువురు నరికారు. ఈమేరకు నిందితులపై కారేపల్లి పోలీసులు శుక్రవారం పీడీ యాక్టు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాణిక్యారం, ఎర్రబోడు గ్రామాలకు చెందిన భూక్యా రమేష్, జాటోతు హరికిషన్, కాంపాటి రమేష్, రాయల మహేష్‌తో పాటు కొందరు మహిళలు అక్రమంగా ఎర్రబోడు రిజర్వ్ ఫారెస్టులోకి ప్రవేశించి ప్లాంటేషన్‌లో మొక్కలను నరికేశారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ సైదా ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టి ప్రాపర్టీ డ్యామేజ్ కింద పీడీ యాక్టు నమోదు చేశామని ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

అవన్నీ నిరాధార ఆరోపణలే..

ఖమ్మంగాంధీచౌక్: దూప దీప నివేదన(డీడీఎన్) అర్చక సంఘం ప్రతినిధులు చేస్తున్న ఆరోపణలు నిరాదారణమైనవని దేవాదాయ శాఖ అర్చక సంఘం, ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు దాములూరి వీరభద్రరావు, తోటకూర వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఖమ్మంలో శుక్రవారం వారు మాట్లాడుతూ అర్చకుల గౌరవ వేతనం తక్కువగా పెరగడానికి తమ ప్రతినిధి ప్రమేయం ఉందని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కాగా, తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న ఆలయాల్లో ముగ్గుల పోటీలు, 13 మహిళా దినోత్సవం, 21వ తేదీన ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

నేడు జిల్లాకు హోంమంత్రి

- రఘునాథపాలెంలో పీఎస్‌ను ప్రారంభించనున్న మహమూద్ అలీ
- తహసీల్‌ను ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను శనివారం ప్రారంభించనున్నారు. కొత్తగా ఏర్పడిన మండలంలో భవనాల నిర్మాణం చేపట్టగా రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభిస్తారు. ఈకార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్ కూడా పాల్గొననున్నారు. ఉదయం 9గంటలకు రఘునాథపాలెం మండలంలోని చెరువు కొమ్ము తండా, పువ్వాడనగర్ గ్రామపంచాయతీల భవనాల నిర్మాణానికి మంత్రి పువ్వాడ శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత రఘునాథపాలెంలోని పోలీసు స్టేషన్, తహశీల్దార్ కార్యాలయాల భవనాలను హోంమంత్రితో కలిసి అజయ్ ప్రారంభించి అక్కడ ఏర్పాటుచేసే సభలో మాట్లాడుతారు. అనంతరం ఖమ్మం సీక్వెల్ రోడ్డులో షాదీఖానా నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేస్తారు. ఈనేపథ్యాన శుక్రవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఎస్సై రవి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఆదిత్యరాజు, తహసీల్దార్ నర్సింహారావు, సుడా డైరెక్టర్ అజ్మీరా వీరూనాయక్ పాల్గొన్నారు.


రఘునాథపాలెంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

హోంమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

ఖమ్మంక్రైం: రాష్ట్ర డిప్యూటీ సీఎం, హోంమంత్రి మహమూద్ అలీ శనివారం జిల్లాకు రానున్నారు. ఈనేపథ్యాన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు సీపీ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం పోలీసు ఉద్యోగులతో సమావేశమై భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ఇంకా రహదారిపైనే ట్యాంకర్

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఈనెల 7వతేదీ అర్ధరాత్రి అదుపుతప్పి పడిన ట్యాంకర్‌ను శుక్రవారం వరకు తొలగించలేదు. మణుగూరు నుంచి డస్ట్ లోడ్‌తో కోదాడలోని సిమెంట్ ఫ్యాక్టరీకి అతివేగంగా వెళ్తున్న ట్యాంకర్ బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద అదుపు తప్పింది. పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి కరెంట్ స్తంభాన్ని ఢీకొని పడింది. ఆ సమయాన అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే, మూడు రోజులు కావొస్తున్నా ట్యాంకర్‌ను తొలగించకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బోనకల్ క్రాస్‌రోడ్డులో పడిపోయిన ట్యాంకర్

విజ్ఞానంతో సమాజాన్ని మేల్కొల్పాలి

- ఐద్వా నాయకులు జ్యోతి, అరుణ జ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్: సమాజంలో సగభాగమైన మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వకుండా వంటింటికే పరిమితం చేయాలని పాలకవర్గాలు చూస్తున్నందున సాధికారిత, సమాజ మార్పు కోసం మహిళలు సమాజాన్ని మేల్కొల్పాలని ఐద్వా జాతీయ నాయకురాలు టి.జ్యోతి, రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జ్యోతి, అరుణజ్యోతి మాట్లాడారు. మహిళలు రెండో తరగతి పౌరులుగా ఉంటున్నా వారిని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి పాలకులకు లేదన్నారు. సమాజ ఆవిర్భావానికి పునాదిగా ఉన్న మహిళలకు రక్షణ కల్పించడంలో పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బండి పద్మతో పాటు పాలడుగు ప్రభావతి, బట్టుపల్లి అనురాధ, రత్నమాల, ప్రమీల, జయశ్రీ, మెరుగు రమణ, పి.ప్రభావతి, నాగసులోచన, మెహరున్నీసా బేగం, టి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శనలో ఐద్వా నాయకులు

అత్యాచారాలను నిరసిస్తూ ప్రదర్శన

త్రిపురలో మహిళలపై బీజేపీ నేతల అత్యాచారాలను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యాన ఖమ్మంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.అరుణజ్యోతి, మల్లు లక్ష్మి మాట్లాడుతూ నరేంద్రమోడీ ఇచ్చిన వాగ్దానాల్లో బేటీ బచావో.. బేటీ పడావో కూడా ఉన్నప్పటికీ మహిళలు, బాలికలకు రక్షణ కల్పించలేకపోయారని విమర్శించారు. ఇక ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలులో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్వీట్లు తయారు చేస్తుండగా పేలిన సిలిండర్


మిఠాయి దుకాణంలో మంటలు ఆర్పుతున్న స్థానికులు, సిబ్బంది

వైరా: ఓపక్క మంట వేడి, మరోపక్క అధిక ఉష్ణోగ్రతల కారణంగా గ్యాస్ సిలిండర్ పేలడంతో స్వీట్ తయారు చేస్తున్న ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. వైరా మున్సిపాలిటీ పరిధి ఏడో వా ర్డులో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు... ఏడో వార్డులోని తెల్లం నిరంజనరావు ఇంట్లో మిఠాయిలు తయారుచేస్తుండగా వాతావరణంలో ని వేడికి సిలిండర్ పేలింది. అయితే, ముప్పును గమనించి సిబ్బంది బయటకు పరిగెత్తడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటనలో వస్తువులన్నీ కాలిపోవడంతో రూ.లక్ష మేర ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్ని మాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. ఇక వైరా శాంతినగర్‌లోని ఇందిరానగర్ కాలనీలో కోటా కృష్ణకు చెందిన వరి గడ్డి వామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. మంటలు ఆర్పేందుకు స్థానికులు యత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే సుమారు రూ.50 వేల విలువ వైన గడ్డి కాలిపోయిందని కృష్ణ తెలిపారు.

మిన్నంటిన రోదనలు

- స్టేజీ పినపాక వద్ద ప్రమాదంలో ముగ్గురి మృతి
- కల్లూరు మండలం వాచ్యానాయక్ తండాలో విషాదఛాయలు

వైరా రూరల్/కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని వాచ్యానాయక్ తండాకు చెందిన గిరిజన కుటుంబం మనవడికి బాసరలో అక్షరాభ్యాసం చేయించి కారులో వస్తుండగా వైరా మండలం పినపాక వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అజ్మీరా రాంబాబు(45), ఆయన కుమార్తె బానోతు అంజలి (25), బానోతు శ్రీవల్లి(18నెలలు) మృతి చెందగా ఇరు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు కాగా మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. ఇదే ఘటనలో గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు రాంబాబు స్వస్థలమైన బోడిమల్లె తండాతో పాటు అంజలి అత్తగారి ఊరైన వాచ్యానాయక్ తండాల్లో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


వాచ్యానాయక్ తండాలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు


సహాయక చర్యల్లో నిమగ్నమైన ఏసీపీ రెహమాన్, పోలీసులు